క్లుప్తంగా

అమిత్‌షా రాజీనామా చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఇచ్చోడ: కేంద్ర మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం మండల కేంద్రంలోని సిరిచెల్మ చౌరస్తా నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. ఆయన రాసిన రాజ్యాంగం వల్లే పదవులు అనుభవిస్తున్న నాయకులు అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నెల లక్ష్మణ్, మహిముద్‌ఖాన్, ముస్తాఫా, దమ్మపాల్, కొత్తురి లక్ష్మణ్, మోహరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: టీబీ (క్షయా) నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని చించోలిలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు టీబీ నిర్మూలన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీబీ మహమ్మారికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. 2025 నాటికి దేశంలో టీబీని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

నేరడిగొండ మాజీ సర్పంచ్ మృతి



రాజేశ్వర్‌రెడ్డి (ఫైల్)

నేరడిగొండ: నేరడిగొండ గ్రామ మాజీ సర్పంచ్ ఏలేటి రాజేశ్వర్‌రెడ్డి(90) శుక్రవారం మృతిచెందారు. ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. 1983 నుంచి 1989 వరకు సర్పంచ్‌గా పని చేశారు. వీడీసీ చైర్మన్‌గా 20 సంవత్సరాలు సేవలు అందించి గ్రామ అభివృద్ధికి పాటుపడ్డారు. ఆయన మృతికి బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వివిధ గ్రామాల మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు



పనులు పరిశీలిస్తున్న సీఈ చవాన్, అధికారులు

బోథ్: బోథ్ మండల కేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్రంలో మరో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉపకేంద్రంలో ఉన్న 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా, మరో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం విద్యుత్ శాఖ ఎస్‌ఈ చవాన్, ఎంఆర్‌టీ డీఈ, ఇచ్చోడ సబ్ డివిజన్ ఏడీ, అధికారులు పరిశీలించారు. త్వరలోనే 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి వస్తుందన్నారు.

ఒంటికాలిపై కార్మికుల నిరసన



ఒంటికాలిపై నిరసనలో కార్మికులు

ఖానాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలు ఏడోరోజుకు చేరాయి. శుక్రవారం నిరవధిక రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు ఒంటికాలిపై నిలబడి వినూత్న నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, విజయ, పద్మ, భాను, నర్సవ్వ, మంజుల, మంగ తదితరులున్నారు.

ఆవుకు వినతి పత్రం

కడెం: మండలకేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన కొనసాగుతోంది. శుక్రవారం కార్మికులు ఆవుకు వినతిపత్రం ఇచ్చి వినూత్నంగా నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాధ మాట్లాడుతూ కార్మికులకు ప్రతి నెల రూ.పది వేల వేతనం ఇచ్చి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. ఇందులో కార్మికులు సునీత, వెంకవ్వ, రజిత, గంగామణి తదితరులున్నారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

- మాజీ ప్రధాని మరణం దేశానికి తీరని లోటు
- నివాళులర్పించిన ఆయా పార్టీల నాయకులు



కైలాస్‌నగర్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



బోథ్: నినాదాలు చేస్తున్న నాయకులు

కై లాస్‌నగర్: నిజాయితీకి, నిబద్ధతకు నిలువుటద్దంగా నిలిచిన ఆర్థికవేత్త, మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజా సేవాభవన్‌లో మన్మోహన్‌సింగ్ సంతాప సభ నిర్వహించారు. పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు తరలివచ్చి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన గొప్ప మేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దిగంబర్ రావు పటేల్, మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, నాయకులు గిమ్మ సంతోష్ రావు, మునిగెల నర్సింగ్, లోక ప్రవీణ్ రెడ్డి, దుర్గం శేఖర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బోథ్: నూతన సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం వేర్వేరుగా నివాళులర్పించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పసుల చంటి, గొర్ల రాజు యాదవ్, చట్ల ఉమేష్, షేక్ నాజర్, బత్తుల రమేష్, షేక్ షాకీర్, గంగాధర్ పాల్గొన్నారు.

తలమడుగు: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీలు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం మండలంలోని సుంకిడి గ్రామంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి మాట్లాడుతూ.. గాడితప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని కొనియాడారు. ఆయన సేవలు మరువలేవన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్యాణం రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ పుల్లారపు బాబన్న, వెంకన్న యాదవ్, రమేశ్‌రెడ్డి, మార్కెట్ మాజీ డైరెక్టర్ గంగారెడ్డి, రామ్ చంద్రరావు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం చాలా బాధాకరమని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో శ్రీకాంత్ రెడ్డి నివాసంలో శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ధర్మపురి చంద్రశేఖర్, అట్ల గోవర్ధన్ రెడ్డి, రహీమ్ ఖాన్, వేముల నాగరాజు, రంజిత్ రెడ్డి, గౌతమ్, అలీం ఖాన్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: దివంగత ప్రధాని మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలు మరువలేవని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పటేల్ మారుతి డొంగ్రె నివాసం వద్ద మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, మసుద్, అనిల్ రాథోడ్, మారుతి, ధన్ను, భూమేష్, సంతోష్, రాజువర్ధన్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దేశంలో అనేక ఆర్థిక సంస్కరణలు చేపట్టారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొత్తురి లక్ష్మణ్, ముస్తాఫా, మహిబుబ్, చోలే ప్రభాకర్, శివకుమార్, ప్రవీన్, బాబురావు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న శ్రీకాంత్ రెడ్డి, నాయకులు



ఇంద్రవెల్లి: పూలమాలల వేస్తున్న నాయకులు



ఇచ్చోడలో..

వసతిగృహంలో వైద్య శిబిరం



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యుడు సర్వరాజ్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని కొలాం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండలంలోని అంకోలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు సర్వరాజ్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఆడే సురేశ్, హెల్త్ అసిస్టెంట్ ప్రేమ్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కై లాస్‌నగర్: తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, సంఘ బాధ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్ పీటీఏ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రియాజ్, జనరల్ సెక్రెటరీ కాంతం, ఉపాధ్యాయులు చరణ్‌సింగ్, అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

సన్మానం

కైలాస్‌నగర్: ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించిన నాయకులను కంది శ్రీనివాస రెడ్డి శుక్రవారం సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్‌గౌడ్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి, శాంతన్‌రావులను జిల్లా కేంద్రంలోని ప్రజా సేవభవన్‌లో శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలి పారు. పార్టీ పటిష్ఠత కోసం మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పాల్గొన్న న్యానేశ్వర్ మౌళి

నార్నూర్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని మహారాష్ట్రలోని అమర్‌ఘడ్ పీఠాధిపతి న్యానేశ్వర్ మౌళి అన్నారు. శుక్రవారం మండలంలోని రాజులగూడ గ్రామంలో శ్రీసంత్ ఈశ్వర్‌సింగ్ బాబా 35 పుణ్యతిథి కార్యక్రమం నిర్వహించారు. జ్వాలాముఖీ దేవి ఆలయ మఠాధిపతి శ్రీరాంసింగ్ మహరాజ్, బృందావన్ నుంచి అరవింద్‌శాస్త్రి, హరిభక్త పారియణ్ గణేశ్ మహరాజ్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీసంత్ ఈశ్వర్‌సింగ్ బాబా అధ్యాత్మికత భావంతో అన్నివర్గాల ప్రజలను జాగృతి చేసేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరాం, మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్, నారాయణ్, జాదవ్ రెడ్డి నాయక్, బానోత్ గజానంద్‌నాయక్, రాథోడ్ డిగాంబర్ పాల్గొన్నారు.

శౌర్య దివస్ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: జనవరి 1న నిర్వహించే భీమా కోరెగావ్ శౌర్యదివస్‌ను విజయవంతం చేయాలని బాబాసాహెబ్ అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. మహారాష్ట్రలోని పుణే పట్టణంలో భీమా నది ఒడ్డున 1818 సంవత్సరం జనవరి 1న ఆత్మ గౌరవం కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి అమరులైన మహర్ వీరుల విజయగాథను స్మరించుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి గ్రామ పటేల్ మారుతి డొంగ్రె, కామ్‌రాజ్ వాగ్మరే, పరత్యాగ్ సందీప్, సూర్యవంశీ ఉత్తమ్, మోరే దిలిప్, మస్కే రాజువర్ధన్ పాల్గొన్నారు.

నేటి విలీన సభను జయప్రదం చేయండి



ఖానాపూర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భైంసాటౌన్: హైదరాబాద్‌లో ఈనెల 28న నిర్వహించే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల కార్యదర్శి జె.రాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద శుక్రవారం కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగే విలీనసభకు ప్రధాన వక్తగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్ సింగ్ ఖట్కర్ హాజరవుతారని.. కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నిర్మల్ డివిజన్ కార్యదర్శి హరిత, నాయకులు గంగాధర్, జైభీమ్ పాల్గొన్నారు.

ఖానాపూర్: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో విలీనసభ పోస్టర్ ఆవిష్కరించారు. కుడుదుల రాజేశ్, గోనె స్వామి, లింగన్న, శ్రీనివాస్, గంగన్న, శేఖర్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



గొల్లమాడలో సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కుంటాల: స్థానికసంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేశెట్టి అశోక్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సాయి సూర్యవంశీ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అందాకూర్, అంబుగామ గ్రామాల్లో బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. అంబుగామలో 54 వ బూత్ అధ్యక్షుడిగా జాదవ్ శివాజీ, అందాకూర్‌లో 65వ బూత్ అధ్యక్షుడిగా బాపన్ పల్లి సాయినాథ్, కార్యదర్శిగా తోకల అనిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోహన్, నారాయణ, ప్రశాంత్, సృజన్, నవీన్, గోవింద్, ప్రసాద్, దత్తు, అఖిల్, శ్రీకాంత్, యోగేశ్, అశోక్, దత్తు, కిరణ్, సదాశివ్, ప్రసాద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొల్లమాడలో..

నర్సాపూర్ (జి): మండలంలోని గొల్లమాడ గ్రామంలో శుక్రవారం బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 74వ బూత్ అధ్యక్షుడిగా నాకిడి లక్ష్మణ్, 75వ బూత్ అధ్యక్షుడిగా పేట గంగాధర్, 76వ బూత్ అధ్యక్షుడిగా దేవన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సీనియర్ నాయకులు సూచించారు. బీజేపీ నాయకులు మెడిసెమ్మె రాజు, మాజీ సర్పంచ్ చెన్న మహేశ్, గుండాల భోజన్న, శ్రీకాంత్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, మిట్టపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా షూటింగ్ సందడి



బోథ్ ఎక్స్‌రోడ్డు వద్ద గల కుంటాల-సోమన్న అర్బన్ పార్క్, పొచ్చెర జలపాతం వద్ద శుక్రవారం బుల్లెట్‌రెడ్డి సినిమా షూటింగ్ సందడి నెలకొంది. చిత్రనిర్మాత, దర్శకుడు, హీరో ఆది బోథ్ మండలంలోని పలు ప్రాంతాల్లో పాటలు, సన్నివేశాలను చిత్రీకరించారు. మరో రెండు రోజుల పాటు షూటింగ్ జరగనున్నట్లు చిత్ర యూనిట్ సభ్యులు పేర్కొన్నారు. బోధన్‌కు చెందిన ఆదిలక్ష్మి మూవీస్ బ్యానర్‌పై చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో నటీనటులు, తదితరులు పాల్గొన్నారు. - బోథ్

ఆడే గజేందర్‌ను కలిసిన నాయకులు

నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను బజార్‌హత్నూర్ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మండల అభివృద్ధికి సహకరించాలని, ఇందిరమ్మ ఇళ్లను మండలానికి కేటాయించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మో ర్తాటి వంశీ తండ్రి అనారోగ్యానికి గురవగా.. శుక్రవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వారి ఇంటికి వెళ్లి పరా మర్శించారు. మండలంలోని గోడలపంపు గ్రామంలో బట్టు రాజేందర్ తండ్రి చిన్నలింగన్న, మామిడి లింగరాజు తండ్రి మామిడి నర్సరాజు మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం గోసంపల్లెలో మృతి చెందిన డా.గంగాధర్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో దయానంద్, వెంకాగౌడ్, తిరుపతిగౌడ్, లక్ష్మీపతిగౌడ్, ఆరె గంగాధర్, జంగిలి శంకర్, కరిపె రాజ్‌కుమార్, అమంద శ్రీనివాస్, సంతోష్, వీరేశ్, చరణ్, ధర్మరాజు, స్వామి తదితరులున్నారు.

భౌభౌ.. భయం భయం



గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సింహాల బెడద రోజురోజుకు పెరుగుతోంది. గుంపులు, గుంపులుగా రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ.. ప్రజలను, వాహనదారులను ఇబ్బందికి గురి చేస్తున్నాయి. వృద్ధులు, చిన్నారులపై దాడులు చేస్తూ.. బీభత్సం సృష్టిస్తున్నాయి.

- సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఘనంగా పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వామి పోతన్న

ముధోల్: మండల కేంద్రంలోని మహాలక్ష్మీ గల్లీలో శుక్రవారం గురుస్వామి పోతన్నయాదవ్ ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. ప్రణీత్ మహరాజ్ మంత్రోచ్ఛరణల నడుమ అయ్యప్పస్వామి ప్రతిమకు, పాలు, నెయ్యితో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్వాములు అనిల్, గంగాధర్, రోళ్ల బాలాజీ, దుర్గప్రసాద్, దత్తు, తదితరులున్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

సోన్: మండలంలోని కడ్తాల్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో శుక్రవారం బీజేపీ నాయకులు రావుల రాంనాథ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గురుస్వామి నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు మెగా వైద్యశిబిరం

ఖానాపూర్: అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోషియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఖానాపూర్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐ పన్నెల జనార్దన్ ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యనిపుణులు రోగనిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ విఠల్, కలెక్టర్ అభిలాష అభినవ్ తదితరులు హాజరవనున్నట్లు పేర్కొన్నారు.

యాచకులకు అల్పాహారం

బాసర: మండలకేంద్రంలో శుక్రవారం బాసర శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జిడ్డు సుభాశ్ యాదవ్.. తన తాత పెద్దసాయన్న జ్ఞాపకార్థం 70 మంది యాచకులకు అల్పాహారం అందించారు.